# భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

- జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్
- బలవంతపు సేకరణను అడ్డుకుంటామని స్పష్టీకరణ
- వికారాబాద్‌లో రైతులతో కలిసి కవిత బైఠాయింపు
- పారిశ్రామికీకరణ ముసుగులో భూదోపిడీ అని విమర్శ
- ఉదయం నుంచి నిరసనలతో హోరెత్తిన వీధులు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. ఆందోళనకారుల తరలింపు



03

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 16 ఏప్రిల్ 2026
పేజీ : 1

## ప్రాతినిధ్యం తగ్గితే సహించం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు
- కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక

03



## మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు

- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం

05



## మహిళా రిజర్వేషన్లలో బీసీలకూ వాటా ఇవ్వాలి

- ఏకపక్ష డీలిమిటేషన్‌పై ఎంపీ మల్లు రవి నిప్పులు

03



# భగభగమంటున్న భానుడు

**43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
- 44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

వివరాలు 2లో..

## మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు

02



## ఏసీబీ వలలో హుజూరాబాద్ మున్సిపల్ ఏఈ

- రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి
- ఎం-బుక్ లో నమోదు కోసం కాంట్రాక్టర్ నుంచి వసూళ్లు



02

## మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

- అదనపు వసూళ్ల ఫిర్యాదులతో అధికారుల తనిఖీలు
- ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు

03

# ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

### రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి

### ఎం-బుక్ లో నమోదు కోసం కాంట్రాక్టర్ నుంచి వసూళ్లు

**కరీంనగర్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టణంలో నిర్మించిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనుల ఫైనల్ బిల్లులను మెజర్మెంట్ బుక్ (ఎం-బుక్) లో నమోదు చేసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి ఈ నగదు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి ఫైనల్ బిల్లుల ప్రక్రియ పూర్తి చేయాలంటే డబ్బులు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను వేధించారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించిన అధికారులు ఏఈని పట్టుకొని ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. వాటర్ డ్రైనేజీ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు విషయంలో ఈ అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు సుధాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం ఆయన్ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పనుల బిల్లుల మంజూరు కోసం లంచం ఆశించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు రైతుల నిరసన

### ధరల తగ్గింపుపై ఆగ్రహం.. అధికారుల కార్యాలయంపై దాడి

### బహిరంగ వేలం నిలిపివేయాలని భారీ ఆందోళన

**నిజామాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు రైతుల నిరసన ఉద్రిక్తంగా మారింది. బహిరంగ వేలం ద్వారా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ ఆగ్రహించిన రైతులు అధికారుల కార్యాలయంపై దాడికి దిగారు. ఈ సందర్భంగా బహిరంగ వేలం పద్ధతిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఆందోళన చేపట్టారు. బుధవారం మార్కెట్ యార్డుకు సుమారు 50 వేల బస్తాల పసుపు అమ్మకానికి రాగా.. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గిస్తున్నారంటూ రైతులు మండిపడ్డారు. మార్కెట్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు కార్యాలయంలోని కుర్చీలు, అద్దాలను ధ్వంసం చేశారు. అధికారులను గెరావ్ చేసి నిలదీశారు. ఆన్ లైన్ లో పసుపు క్వింటాల్ ధర 16 వేల రూపాయలుగా ఉంటే.. బహిరంగ వేలంలో మాత్రం మూడు వేల రూపాయలు తగ్గించి 13 వేలకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యత్యాసం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆఫ్ లైన్, బహిరంగ వేలం కొనుగోళ్లను నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆన్ లైన్ లో ఉన్న ధరనే తమకు వర్తింపజేయాలని పట్టుబట్టారు. భారీ ఎత్తున రైతులు తరలిరావడంతో మార్కెట్ యార్డులో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. అధికారులు స్పందించి తమకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని కోరారు.

# భగభగమంటున్న భానుడు

- రాష్ట్రవ్యాప్తంగా 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
- 44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఎండలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి ఉన్నాయి.

### పెరగనున్న ఉష్ణోగ్రతల తీవ్రత

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఇవి క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని పేర్కొంది.

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వడగాల్పులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మధ్యాహ్నం వేళ భానుడి భగభగలకు జనం బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు



**వరంగల్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** ప్రధాని మోదీ సుపరిపాలనలో వరంగల్‌లో మునుపెన్నడూ చూడని అపూర్వమైన అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ జరుగుతోందని తెలిపారు. పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కాబోతుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రగతికి కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా రాజకీయ సాధికారతకు బాటలు వేస్తూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం పట్ల వరంగల్ ప్రజలు అమితమైన హర్షం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు.



### నారీ శక్తి వందన్ విజయోత్సవం

నరేంద్ర మోదీకి తెలంగాణ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని నారీమణులతో కలిసి చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం విజయోత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం.. నవ భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చబోతున్న ఒక సువర్ణాధ్యాయం అని కొనియాడారు.

### వీధి వ్యాపారులకు అండగా పీఎం స్వనిధి

వరంగల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీధి వ్యాపారులకు టీ స్టాళ్లు పంపిణీ చేశారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలో, ప్రజలకు నిత్యావసరాలను వారి ముంగిటకే చేరవేయడంలో వీధి వ్యాపారుల పాత్ర అత్యంత కీలకం అని పేర్కొన్నారు. వీరి కష్టాన్ని గుర్తించిన మోదీ పీఎం స్వనిధి పథకం ద్వారా వారి జీవనోపాధికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఈ పథకం కింద వరంగల్ అత్యధిక లబ్ధి పొందడం.. పేదలు, శ్రమజీవులు, చిరు వ్యాపారుల సంక్షేమం పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు.

వరంగల్ పర్యటన నిమిత్తం విచ్చేసిన అధ్యక్షుడికి బీజేపీ కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి బీజేపీ కార్యకర్త హృదయంలో వరంగల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. 1984లో దేశవ్యాప్తంగా పార్టీ కేవలం రెండు స్థానాలు గెలుచుకున్నప్పుడు, అందులో ఒక చారిత్రాత్మక విజయం వరంగల్ గడ్డపై జంగారెడ్డి రూపంలో నమోదైందని గుర్తుచేశారు. ఆనాటి ఆ చారిత్రక ఘట్టం నేటికీ తరతరాల కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూనే ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కమల వికాసానికి, పార్టీని మరింత విస్తరించాలనే దృఢ సంకల్పాన్ని ఇది మరింత బలపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రాతినిధ్యం తగ్గితే సహించం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు
- కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ తీవ్ర హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణగానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

## ప్రగతిశీల రాష్ట్రాలకు అన్యాయం

తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.

## పార్లమెంటులో గళం నొక్కొద్దు

దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణిచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. "ఢిల్లీ పాలకులు మా మాట వినాలి, బుద్ధి ప్రభలాలని ఆశిస్తున్నాం" అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# మహిళా రిజర్వేషన్లలో బీసీలకూ వాటా ఇవ్వాలి

## రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయం

## ఏకపక్ష డీలిమిటేషన్‌పై ఎంపీ మల్లు రవి నిప్పులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (మనసులో మాట):** మహిళా రిజర్వేషన్లతో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేపడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పార్లమెంటులో దీనిపై తమ గళం వినిపిస్తామని, ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

## కేంద్రానిది రాజకీయ కుట్ర



అహంకారపూరిత మాటలతో సీఎంను నోరు మూసుకొని కూర్చోమనడం కిషన్ రెడ్డికి తగదని మల్లు రవి మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు విలువ ఉండాలని, రేవంత్ రెడ్డి చెప్పిన అంశాలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. దేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిబద్ధతను చాటి చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం హడావుడి చేస్తోందని విమర్శించారు. వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలిపి చూపిస్తూ ప్రతిపక్షాలు సహకరించడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

## అమలుపై కాలయాపన వద్దు

ఈ రెండు అంశాలకు ఒకదానికొకటి సంబంధం లేదని, వీటిని వేర్వేరుగా చర్చించి అమలు విధివిధానాలపై పార్లమెంటు నిర్ణయం తీసుకోవాలని మల్లు రవి కోరారు. రాజ్యాంగంలో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో స్థానిక సంస్థల్లో, సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చామని తెలిపారు. అప్పట్లో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందలేదని విమర్శించారు. 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడం రాజకీయ కుట్ర అని, 2011 జనాభా లెక్కల ఆధారంగానే చట్టాన్ని ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# దక్షిణాదికి అన్యాయం జరగదు

## అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపు ఉండాలి

## బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని, అందుకే అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపు విధానాన్ని తీసుకువచ్చారని తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికనే డీలిమిటేషన్ జరగాలని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే చట్టాలు చేసిందని గుర్తు చేశారు. 1972లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఒక లోక్‌సభ సీటు తగ్గిందని వివరించారు.

## సీట్ల పెంపుతో మహిళలకు మేలు

ప్రస్తుతం ఉన్న సీట్ల ప్రకారం మహిళలకు 170 సీట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. సీట్లు పెంచి మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే ఆ సంఖ్య 270 దాటుతుందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి హైబ్రిడ్ పాలసీని ప్రతిపాదించారని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాదికి నష్టం జరగకుండా, ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగానే అవి పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## రాజ్యాంగ విరుద్ధ ప్రకటనలు

ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. డీలిమిటేషన్, మహిళా బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేయడం సరికాదని హితవు పలికారు. జీఎస్‌డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలనే నిబంధన ఎక్కడ ఉందో చెప్పాలని నిలదీశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని గుర్తు చేశారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ ముందు వరుసలో ఉన్నాయని, మహిళల వాటా తగ్గించడానికి ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

## అదనపు వసూళ్ల ఫిర్యాదులతో అధికారుల తనిఖీలు

## ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణవ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లోని మీసేవ కేంద్రాల్లో ఏసీబీ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పౌర సేవల పత్రాల జారీలో దళారుల ద్వారా సిబ్బంది భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సేవల పేరుతో అడ్డగోలు దోపిడీ

మీసేవ కేంద్రాల్లో దోపిడీ ఎక్కువైపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్ ఛార్జీల పేరుతో సిబ్బంది చేస్తున్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం వెళ్తే సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారు. సాంకేతికతతో పౌర సేవలను సులభతరం చేస్తున్నామని చెప్తున్న పాలకులు.. అన్ని సేవలను మీసేవ కేంద్రాలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు.

## నిబంధనల ఉల్లంఘన

కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధృవీకరణ, ఓబీసీ పత్రాల కోసం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఈ ఫీజు ఎక్కడా అమలు కావడం లేదు. ఒక్కో పత్రానికి 500 నుండి 1000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తు చేసేటప్పుడే కాకుండా సర్టిఫికేట్లు ప్రింట్ తీసుకునే సమయంలో కూడా అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. అఫిడవిట్లు సమర్పించాలనే నిబంధనలను సాకుగా చూపి వందల్లో దండుకుంటున్నారు. మీసేవ కేంద్రాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉన్నా చాలా చోట్ల అది కనిపించడం లేదు. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాధితులు డయల్ 1100 లేదా 18004251110 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# చెన్నూర్ అభివృద్ధియే ప్రధాన లక్ష్యం

## మందమర్రిలో పనులపై మంత్రి వివేకానంద సమీక్ష

**మంచిర్యాల, ఏప్రిల్ 15:** చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధియే ప్రధాన లక్ష్యంగా ప్రతి ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఆయన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రతి రోజు నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను నిర్దేశించారు. మందమర్రిలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రం, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను మంత్రి సందర్శించారు. రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రూపాయలతో ఏటీసీలను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. టామ్ కామ్ ద్వారా జర్మనీ వంటి దేశాలలో విరివిగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ప్రైవేటు ఏజెన్సీలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

# భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

### జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్




**వికారాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పరిగి పారిశ్రామిక కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా వికారాబాద్‌లో నిరసన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. పారిశ్రామిక కారిడార్ పేరిట రైతుల భూములను బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ ఆమె బుధవారం ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశ్రామికీకరణ ముసుగులో ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని కవిత ఆరోపించారు. భూసేకరణ నిలిపివేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులను అడ్డుకునే క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు కవితతో పాటు పలువురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ధర్మ సమాజ్ పార్టీ మద్దతు ప్రకటించింది. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేశారు.



# అపోహలతో గందరగోళం సృష్టించవద్దు

- రేవంత్ తీరుపై బీజేపీ నిప్పులు
- రాజ్యాంగ నిబంధనలు చదవాలని హితవు



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తం చేస్తున్న అనుమానాలను బీజేపీ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ రెండింటినీ కలపడం వెనుక కుట్ర కోణం ఉందన్న సీఎం వ్యాఖ్యలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని ఆయన ప్రధానికి లేఖ రాశారు. రేవంత్ రెడ్డి అపోహలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని బీజేపీ నేతలు విమర్శించారు. పార్లమెంటు అత్యున్నత వేదిక అని, నిర్ణయాలన్నీ అక్కడే జరుగుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ కు ఈ అంశంపై కనీస అవగాహన లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

### రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ప్రధాని మోదీకి సీఎం రాసిన లేఖపై బీజేపీ నేత రామచందర్ రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రజల్లో భయాలను వ్యాప్తి చేయడం ఆపాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని చదవాలని సూచించారు. డిలిమిటేషన్ అనేది కేవలం జనాభా పైనే ఆధారపడి ఉండదని, అవసరమైన ఇతర అంశాలను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని వివరించారు. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములా అనుసరించాలనే నిర్ణయాన్ని కమిషన్ కే వదిలేయాలని, అనవసర రాజకీయాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

### రాష్ట్రాల అభిప్రాయ సేకరణ

మహిళా రిజర్వేషన్లతో డిలిమిటేషన్ ను ముడిపెట్టవద్దని రేవంత్ తన లేఖలో కోరారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని, కీలక నిర్ణయాల్లో రాష్ట్రాల, రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా జాతీయ స్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే ముందడుగు వేయాలని రేవంత్ కోరారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందిస్తూ.. ఇటువంటి మాటలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని హితవు పలికారు.

# వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యం

### అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా చార్మినార్

### కమాన్ల పునరుద్ధరణ పనులపై మంత్రి జూపల్లి సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** హైదరాబాద్ చారిత్రక కట్టడమైన చార్మినార్, పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సందర్శించారు. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడుతూ వాటిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. చార్మినార్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మచిలీ కమాన్ పునరుద్ధరణ కోసం ఇప్పటికే నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో.. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

### పునరుద్ధరణ పనుల వేగవంతం

షేర్–ఇ–బాతీల్ కమాన్ రినోవేషన్ పనులను వేగవంతం చేయాలని, చార్మినార్ వద్ద ఉన్న ఫౌంటైన్‌ను ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన నూతన పర్యాటక విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక వసతులు మెరుగుపరచడం ద్వారా పర్యాటకంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

### ప్రపంచ పటంలో భాగ్యనగరం

హైదరాబాద్ నగరాన్ని పర్యాటకంగా ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, నగర వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునిక హంగులు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చారిత్రక కట్టడాల వైభవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పునరుద్ఘాటించారు.

# జనాభా ప్రకారమే డీలిమిటేషన్

### సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు గందరగోళం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు



**వరంగల్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రామచందర్ రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రామచందర్ రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని రామచందర్ రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రామచందర్ రావు హితవు పలికారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని విమర్శించారు. పునర్విభజన ప్రక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు

- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన నిలదీశారు. యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావడం తెలుగువాడిగా తనకు గౌరవమని లక్ష్మణ్ పేర్కొన్నారు. తనపై సీఎం చేసిన వ్యాఖ్యలపై బుధవారం న్యూఢిల్లీలో లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు.

### మహిళల హక్కులపై కుట్రలు

మహిళల అవకాశాలను దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా? ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారా? అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బేనని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బున్న వాళ్లకే ఓటు విలువ ఎక్కువ అనేలా రేవంత్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని లక్ష్మణ్ పేర్కొన్నారు.

### హైదరాబాద్ విభజనపై ప్రశ్న

గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని లక్ష్మణ్ మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో 150 సీట్లను 300 సీట్లు చేశారని తెలిపారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారని సీఎంను సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని చెప్పారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలనే కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు.

### డీలిమిటేషన్ విధానంపై నిలదీత

ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. జీఎస్‌డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలనేది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదనలు చేస్తున్నారని, వెంటనే వీటిని వెనక్కి తీసుకోవాలని రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ నేత మహ్మద్ జావేద్ దుర్మరణం

### రోడ్డు ప్రమాదంలో మృతి

### తీరని లోటు అన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





**ఖమ్మం, ఏప్రిల్ 15 (మనసులో మాట):** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మహ్మద్ జావేద్ సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. జావేద్ మృతి పార్టీకి, ఖమ్మం నగర ప్రజలకు తీరని లోటు అని కొనియాడారు. జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. ఆయన మరణం ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఒక శూన్యాన్ని మిగిల్చిందని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

### పులిగుండాలను ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

### మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**పెనుబల్లి, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. జంగిల్ సఫారీ, బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రకృతి ఒడిలో కాసేపు విహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

### ప్రకృతి సంపదకు గుర్తింపు

పులిగుండాలను రాష్ట్రంలోని మొదటి మూడు ఉత్తమ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా నిలబెడతామని మంత్రి హామీ ఇచ్చారు. పర్యాటకుల సౌకర్యార్థం ఇక్కడికి వెళ్లే మార్గాన్ని వెంటనే డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే విన్నపం మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని తెలిపారు.

### ఉపాధి అవకాశాల మెరుగు

నీటి మళ్లింపు ద్వారా వేసవిలోనూ ఈ ప్రాంతం జలకళతో ఉంటుందని, పర్యాటక అభివృద్ధి వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పొంగులేటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. వీరితో పాటు సీపీ సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ హాజరయ్యారు.


# పాటలే తెలుసు.. స్కామ్‌లు తెలియవు

### మీడియా ముందు సింగర్ మంగ్లీ ఆవేదన

### తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమని వెల్లడి

### ఐదుగురు వ్యక్తులపై డీజీపీకి ఫిర్యాదు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తనకు పాటలు పాడటం తప్ప స్కామ్‌లు చేయడం తెలియదని, నిరాధార ఆరోపణలతో ఎంతో నలిగిపోతున్నానని సింగర్ మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. స్కామ్‌లతో తనకు సంబంధం లేదని, ఒకవేళ తప్పు చేసినట్లు రుజువైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన తనకు డబ్బు విలువ తెలుసని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం వల్ల నెల రోజులుగా రికార్డింగ్‌లు, ప్రోగ్రామ్‌లు వదులుకోవాల్సి వచ్చిందని, ప్రజల్లోకి తప్పుడు సమాచారం వెళ్తోందని వాపోయారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధు నాయక్, హిమకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావులపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు మంగ్లీ వెల్లడించారు. తాను ఎప్పుడూ బాధితుల పక్షానే ఉంటానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె తరపు న్యాయవాది మాట్లాడుతూ స్కామ్ చేసిన వారే బాధితుల రూపంలో మీడియా ముందుకు వస్తున్నారని ఆరోపించారు. 'సుభక్షేత్ర బిజినెస్' అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి కుంభకోణానికి పాల్పడింది మధు అని, ప్రస్తుతం బాధితుడిగా మాట్లాడుతున్న హిమకాంత్ రెడ్డి ఆ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారని న్యాయవాది వివరించారు. ఈ స్కామ్‌తో మంగ్లీకి ఎటువంటి సంబంధం లేదని, అసలైన నిందితులను వదిలేసి ఆమెను బలిపశువును చేస్తున్నారని మండిపడ్డారు. నిందితుల అసలు రంగు బయటపడాలని డిమాండ్ చేశారు.



# హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

### పాఠశాలలోకి అనుమతించని హెడ్ మాస్టర్

### జయశంకర్ భూపాలపల్లిలో బజరంగ్ దళ్ నిరసన

**భూపాలపల్లి, ఏప్రిల్ 15 (మనసులో మాట):** హనుమాన్ మాల ధరించిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకుండా అవమానించిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాఠశాల ముందు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. హిందూ ఆచారాలను కించపరిచిన సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ప్రాంగణంలో బైఠాయించారు.

### గేటు వద్దే అడ్డుకున్న వైనం

జిల్లా కేంద్రంలోని ఒక పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. ఇందులో భాగంగా హనుమాన్ మాల ధరించి బుధవారం పాఠశాలకు వెళ్లగా హెడ్ మాస్టర్ గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రావడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విద్యార్థిని లోపలికి పంపే ప్రసక్తే లేదని హెడ్ మాస్టర్ మొండికేయడంతో వివాదం మొదలైంది.

### నిరసనతో దద్దరిల్లిన పాఠశాల

ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బజరంగ్ దళ్ కార్యకర్తలు కూడా వారికి తోడవడంతో పాఠశాల ప్రాంగణం నినాదాలతో దద్దరిల్లింది. హిందూ ధర్మ ఆచారాలను అవమానించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ముందు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సదరు హెడ్ మాస్టర్‌ను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనతో పాఠశాల పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# నిబంధనలే ప్రాణాలకు రక్షణ

- ఆదిలాబాద్‌లో ఘనంగా రహదారి భద్రత అవగాహన సదస్సు
- విద్యార్థులతో భారీ మానవహారం.. బైక్ ర్యాలీ ప్రారంభించిన మంత్రి పొన్నం



**ఆదిలాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** రోడ్డు నిబంధనలే ప్రాణాలకు రక్షణ అని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భారీ మానవహారాన్ని నిర్వహించడమే కాకుండా బైక్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లాకు చేరుకున్న మంత్రికి ఇన్చార్జి కలెక్టర్ యువరాజ్ మర్మట్, ఎస్పీ అఖిల్ మహజన్ సాదరంగా ఆహ్వానం పలికారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడంలో విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

## ప్రమాదాల నివారణకు ప్రభుత్వ చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎమర్జెన్సీ అనే నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రాణాలు కాపాడిన వారికి 'రహవీర్' అవార్డు ద్వారా 25 వేల నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లను, డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.

## చిన్నారుల కోసం ట్రాఫిక్ పార్క్

రహదారి నిబంధనలపై అవగాహన చిన్ననాటి నుంచే అలవడాలని మంత్రి పేర్కొన్నారు. చావర పాఠశాలలో ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్'ను ఆయన ప్రారంభించారు. చిన్న వయసులోనే అవగాహన కల్పించేందుకు పాఠ్యాంశాల్లో కూడా రహదారి భద్రతను చేర్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం 'ఖాకీ కిడ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

## ఏజెన్సీ అభివృద్ధిపై విన్నపాలు

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో ఆర్‌టీఓ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఉట్నూర్ బస్టాండ్ పరిసరాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉపాధి కల్పించాలని, ఆదిలాబాద్‌కు నాన్‌స్టాప్ మినీ బస్సులను ప్రవేశపెట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష పాల్గొన్నారు.

# 30 గృహ ఎల్పీజీ సిలిండర్ల స్వాధీనం

**నిజామాబాద్ జిల్లాలో టాస్క్ ఫోర్స్ తనిఖీలు**

**నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు వినియోగం**



**నిజామాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** నిజామాబాద్ జిల్లాలో హోటళ్లపై నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వాణిజ్య ప్రయోజనాలకు గృహ సిలిండర్లను అక్రమంగా ఉపయోగిస్తున్న హోటళ్లపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి మొత్తం 30 సిలిండర్లను సీజ్ చేసింది. అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి, డీఎస్పీ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పవన్ కుమార్, శ్రీనివాస్, నికిల్ రాజ్, వినోద్, మహేష్ కుమార్ ఈ బృందంలో ఉన్నారు. నియమాలకు విరుద్ధంగా గృహ ఎల్పీజీ సిలిండర్లను వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# బూత్ స్థాయి నుంచి బలోపేతం కావాలి

- డివిజన్ అధ్యక్షులకు మధుయాష్కి గౌడ్ పిలుపు
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన



**ఎల్బీనగర్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పార్టీ డివిజన్ అధ్యక్షులతో వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని, నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలని కోరారు.

## ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

త్వరలో జరగనున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఓటర్ల తొలగింపు, చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మధుయాష్కి గౌడ్ ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ తరపున బూత్ ఏజెంట్లు నిబద్ధతతో పనిచేసి ఓటరు జాబితాను క్రమబద్ధీకరించాలన్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో డివిజన్ అధ్యక్షుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, బండా సురేందర్ రెడ్డి, డి. శశిధర్ రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మంజుల రెడ్డి పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, మెగావత్ గణేష్ నాయక్, నాయకులు తులసి శ్రీనివాస్, భీమిడి రామకృష్ణ రెడ్డి, దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్, రిజ్వాన్, శ్రీనాథ్ హాజరయ్యారు.

# జీరో బిజినెస్' చేస్తే లైసెన్స్‌లు రద్దు

**జూలై నాటికి మార్కెట్లలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి**

**మార్కెటింగ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష**

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' చేసే ట్రేడర్ల లైసెన్స్‌లను రద్దు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 568.50 కోట్లు కేటాయించిందని, జూలై నాటికి మార్కెట్లలో సోలార్ విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మార్కెటింగ్ యార్డులలో రూ. 568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో రూ. 128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదించారు. మిగిలిన పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డుల్లో జీరో బిజినెస్ అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్స్‌లు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. గడ్డిఅన్నారం మార్కెట్‌లో అమలు చేస్తున్న 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' సాఫ్ట్‌వేర్ విధానాన్ని పరిశీలించి, ఫలితాలు ఆశాజనక ఉంటే అన్ని యార్డులను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. కోహెడ పండ్ల మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గించేందుకు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జూలై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని, రైతులకు మంచి ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.



# ప్రెస్ క్లబ్ భవన నిర్మాణమే లక్ష్యం

- పూర్తిస్థాయి నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన వజ్జ వీరయ్య యాదవ్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

**సూర్యాపేట, ఏప్రిల్ 18 (మనసులో మాట):** సూర్యాపేట ప్రెస్ క్లబ్ భవన నిర్మాణమే ప్రధాన అజెండాగా నూతన కమిటీ పని చేస్తుందని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వజ్జ వీరయ్య యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు సరైన భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఆయా జర్నలిస్టు సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్లకు అతీతంగా సూర్యాపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయింపు జరిగినప్పటికీ భవన నిర్మాణం చేసుకోలేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

### సమన్వయంతో భవన నిర్మాణం

జర్నలిస్టులకు సరైన గుర్తింపు, సౌకర్యాల కల్పన కోసం నూతన కమిటీ అందరినీ కలుపుకొని పోతుందని వీరయ్య యాదవ్ వివరించారు. ప్రతి జర్నలిస్టు నూతన కార్యవర్గానికి సహకరించి భవన నిర్మాణానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొనే వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఏర్పడిన నూతన కార్యవర్గం భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తుందని వెల్లడించారు.

### నూతన కార్యవర్గ ప్రకటన

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా చలసాని శ్రీనివాసరావు, నాయిని శ్రీనివాస రావు, అధ్యక్షులుగా వజ్జె వీరయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఐతగాని రాంబాబు, కోశాధికారిగా తల్లాడ చందన్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా మిక్కిలినేని శ్రీనివాసరావు, షేక్ జహంగీర్, గుండా శ్రీనివాస్ గుప్తా, తోట నర్సయ్య, వర్ధిల్లి అరుణ కృష్ణ, బంటు కృష్ణ, చల్లా చంద్రశేఖర్, రాపర్తి మహేష్ బాధ్యతలు చేపట్టారు. ప్రచార కార్యదర్శిగా ఉటూకూరి రవీందర్, ఉపాధ్యక్షులుగా సుంకరబోయిన వెంకటయ్య, పెద్దింటి శ్యామ్ సుందర్ రెడ్డి, చౌగాని నరేందర్, మదూరి బ్రహ్మాచారి, దేవరగట్ల సతీష్, పులుసు నాగరాజు, గుడిపూడి రామకృష్ణ, ఉయ్యాల నర్సయ్య, ఖలీల్, మామిడి శ్రావణ్, బొడ్డు నాగరాజు, వేల్పుల ప్రవీణ్ నియమితులయ్యారు.

### సభ్యుల ఎన్నిక

సహాయ కార్యదర్శులుగా కందుకూరి యాదగిరి, అమరగాని నాగేందర్, మాదగాని వేణు, కందుల నాగరాజు, ఎరుకల సైదులు, బుక్క ఉపేందర్, పెనుగొండ మల్లికార్జున్, మామిడి శంకర్, పడిసిరి వెంకట్, దుర్గం బాలు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా బచ్చు పురుషోత్తం, షేక్ రషీద్, మాధవ్, కొండ్లి కృష్ణయ్య, పుట్ట రాంబాబు, బచ్చలకూరి వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా లింగాల సాయి, కంచర్ల సురేందర్, జంపాల ఉపేందర్, దుస్స చంద్రశేఖర్, గిరీష్ కుమార్ లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు బొజ్జ ఎడ్వర్డ్, గునగంటి సురేష్, బుక్క రాంబాబు, ఉట్కూరి రవీందర్, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




అధ్యక్షులు: వజ్జే వీరయ్య | ప్రధాన కార్యదర్శి: ఐతగాని రాంబాబు

# పీర్జాదిగూడ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా కేటీఆర్?

- ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

**మేడ్చల్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పీర్జాదిగూడ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి సవాలు విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల ఊబిలోకి ముంచారని, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో అంతులేని అవినీతి జరిగిందని తుంగతుర్తి రవి ఆరోపించారు. తన మచ్చ తాను చూసుకోకుండా గురువింద గింజ మాదిరిగా కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారం కోల్పోయిన బాధతోనే కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 30 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అద్భుత పథకాలను అమలు చేస్తోందని రవి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. రేషన్ కార్డుల పునరుద్ధరణ, నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి చర్యలు ప్రజల ఆదరణ పొందుతున్నాయని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా ద్వారా బీఆర్ఎస్ నేతల అక్రమ సామ్రాజ్యాలను నేలమట్టం చేసి కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు రవి వెల్లడించారు. కబ్జాకోరుల చేతుల్లో ఉన్న వందలాది చెరువులను హైడ్రా విముక్తం చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. పీర్జాదిగూడలో ఎస్ఎన్డీపీ పనులకు శంకుస్థాపన చేసిన కేటీఆర్ ఆ పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో సమాధానం చెప్పాలని నిలదీశారు.

### అసంపూర్తి పనులపై ప్రశ్నలు

ఎనిమిదేళ్లు గడుస్తున్నా కేంద్రాన్ని ఒప్పించలేక ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను అర్ధాంతరంగా నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. పీర్జాదిగూడ నుండి కాచవాని సింగారం వరకు రోడ్డు పనులను వదిలేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అతి తక్కువ కాలంలోనే వాటిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసినట్లు గుర్తు చేశారు. గడిచిన 30 నెలల్లో పీర్జాదిగూడలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై ఏ చౌరస్తాలోనైనా చర్చకు సిద్ధమని తుంగతుర్తి రవి సవాలు విసిరారు.



# లచ్చిమల్ల వెంకన్నకు దళిత రత్న అవార్డు

**పురస్కారం అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**సామాజిక సేవలో వెంకన్న కృషికి దక్కిన గౌరవం**



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** లచ్చిమల్ల వెంకన్నకు దళిత రత్న అవార్డు దక్కింది. సామాజిక సేవలో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గంధమల్ల చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లుతో కలిసి వెంకన్నకు అవార్డు ప్రదానం చేశారు. సూర్యాపేట జిల్లా పెనుపహాడ్ మండలం చీదెళ్ళ గ్రామానికి చెందిన వెంకన్న విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొని, 21 ఏళ్లకే ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు.

### తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

2001 నుంచి 2014 వరకు తెలంగాణ సాధన కోసం జేఏసీతో కలిసి వెంకన్న అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2011లో టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఏర్పాటులో కీలక భూమిక పోషించి, ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పోరాడుతూనే అంబేద్కర్ భావజాలంతో దళిత అభివృద్ధికి కృషి చేస్తున్నారు. దళిత, పేద, బడుగు వర్గాల కోసం తన శక్తి మేరకు సహకారం అందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

### సామాజిక బాధ్యత పెరిగింది

అవార్డు అందుకున్న సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఈ పురస్కారం తనపై సామాజిక బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. నిబద్ధతతో సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని చూసి యువత ముందుకు రావాలని కోరారు. తనకు అవార్డును ఎంపిక చేసిన జ్యూరీ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. వెంకన్నకు దళిత రత్న అవార్డు రావడం పట్ల గడ్డం సత్యనారాయణ, మిత్రులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బకాయిల కోసం పెన్షనర్ల లేఖల పోరు

- రాష్ట్రపతి, సుప్రీంకోర్టుకు సామూహిక వినతులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రిటైర్డ్ ఉద్యోగుల ఆగ్రహం



**ఎల్బీనగర్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు విడివిడిగా, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ, పెన్షనర్ల జేఏసీ పక్షాన రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నాయి. 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉద్యోగులు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ లాంటి వేదికలను ఏర్పాటు చేసుకుని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్సీలు కూడా నిరాహారదీక్షలు చేశారు. అయినా ప్రభుత్వం బకాయిల చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తోంది.

### సామాజికవేత్త లేఖకు మద్దతు

ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై వత్తిడి తేవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం, నిర్లిప్తతకు నిరసనగా సామాజికవేత్త బక్కా జడ్సన్ వ్రాసిన లేఖను సుప్రీంకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. అందుకు మద్దతుగా రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు అందరూ ఈ నెల 15వ తేదీన సామూహికంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, రిజిస్ట్రార్, భారత రాష్ట్రపతికి లేఖలు వ్రాయాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పెన్షనర్లు అందరూ అందుబాటులో ఉన్న పోస్టాఫీసులకు వెళ్ళి మూకుమ్మడిగా లేఖలను పోస్టు చేయాలని కోరారు. అందులో భాగంగానే ఎల్బీనగర్ లోని వాసవీ శ్రీ నిలయం గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న పెన్షనర్లు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రదర్శన చేశారు. దాదాపు 15 మంది సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, రిజిస్ట్రార్, భారత రాష్ట్రపతికి వ్రాసిన లేఖలను సమీప పోస్టు ఆఫీసుకు వెళ్ళి సామూహికంగా పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు ఆకుల సురేష్ కుమార్, గోలి రాజయ్య, ఇమ్మడి వెంకటేశం, సూర్యపల్లి ఉమాదేవి, ఇంజమూరి రఘునందన్, వీరమల్ల అంజయ్య, టీ. యాదగిరి, లంకా సత్యవర్ధన్, రచ్చ ఎల్లయ్య, పల్లాటి నాగయ్య, కొనకంచి భరత్ కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

**దేవరుప్పులలో నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**

**అర్హులకే పథకం వర్తించాలని అధికారులకు ఆదేశం**



**జనగామ, ఏప్రిల్ 15 (మనసులో మాట):** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దేవరుప్పుల మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఇళ్ల నిర్మాణం, నీరు, కిటికీల అమరిక, ప్లాస్టరింగ్, విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లను త్వరితగతిన గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యమైన సామాగ్రిని మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఇసుక కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, తెలంగాణ శాశ్వత నివాసితులైన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తెలిపారు.

### లబ్ధిదారులతో ముఖాముఖి

ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. వారి ఖాతాల్లో ఇప్పటివరకు ఎన్ని విడతల్లో నగదు జమ అయిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

**పీర్జాదిగూడలో కాంగ్రెస్ నుంచి వచ్చిన సీనియర్ నేతలు**

**గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన వర్కింగ్ ప్రెసిడెంట్**

**మేడ్చల్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పీర్జాదిగూడలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మాజీ మేయర్ జక్క వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికల ప్రక్రియ సాగింది. మాజీ కార్పొరేటర్ కొడే పోచయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కేటీఆర్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పీర్జాదిగూడ పలని కన్వెన్షన్‌లో జరిగిన ఈ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సభకు హాజరైన కార్యకర్తల నినాదాలతో కన్వెన్షన్ హాల్ మార్మోగింది. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. పీర్జాదిగూడలో రాజకీయ సమీకరణాలు ఈ చేరికలతో ఒక్కసారిగా మారిపోయాయి.

